మరో ప్రపంచం పిలిచింది

మండుతూన్న ఎండలాగే కడుపులో ఆకలి కూడా నిముషనిముషానికీ పెరిగిపోతోంది. అరగంటనుంచి ఆగకుండా నడవడం మూలంగా నుదుటిమీదనుంచి చెమట ధారాపాతంగా కారుతోంది. చేతులతో మొహానికి పట్టిన చెమటను తుడుచుకొంటూ టవర్‌క్లాక్‌కేసి తలెత్తి చూశాడు సుబ్రహ్మణ్యం.

"అమ్మో? అప్పుడే పన్నెండయిపోయింది" అప్రయత్నంగా తనలోతానే గొణుక్కొన్నాడు. అయిదున్నరడుగుల అస్థిపంజరం. గట్టిగా గాలివీస్తే ఎగిరిపోయేలా ఉన్న శరీరం, ఆకలితో ఆలోచనతో పదునెక్కిన మేధ. వీటన్నిటినీ కలిపితే సుబ్రహ్మణ్యం! బి.ఏ.లో ఫస్ట్‌క్లాస్ ఎం.ఏలో యూనివర్సిటీ ఫస్ట్ తొమ్మిదేళ్ళ నిరుద్యోగం వీటన్నిటినీ కూడితే సుబ్రహ్మణ్యం!!

కళ్ళు గడియారపు ముళ్ళను పన్నెండు మీద చూడగానే కాళ్ళు మరింత వేగాన్నందుకొన్నాయి. పన్నెండున్నరకంతా అక్కడుండాలి. ఇంటర్వ్యూ జరిగే ఆఫీసుకు చేరుకోవాలంటే మరో నాలుగు కిలోమీటర్లు నడవాలి.

అతని నడక నెమ్మదిగా పరుగులోకి మారింది.

అరచేతులకు పట్టిన చెమటతో పేపర్‌ఫైల్ తడిసిపోతోంది. పాతికేళ్ళుగా పాఠ్యపుస్తకాలను ఔపోసన పట్టినందుకు గాను ఇచ్చిన సర్టిఫికెట్లు అందులో నలిగిపోతున్నాయి. దాదాపు తొమ్మిదేళ్ళ క్రితం అవి కొత్త కరెన్సీ నోట్లలా

పెళపెళలాడుతుండేవి. కానీ ఇప్పుడు..

డెబ్బైమూడు ఇంటర్వ్యూల తరువాత నలిగి మెత్తబడి నీరసించి పొయ్యాయి. చేతిలో ఫైలుతో పరుగులాంటి నడకతో వేగంగా వెళ్ళిపోతున్న అతన్ని ఆ జనారణ్యంలో ఎవ్వరూ పట్టించుకోలేదు. అదే ఒకప్పుడయితే ఎంతగా చూసేవారేమో? ఇప్పుడయితే అలా పరిగెత్తే వాళ్ళని చూసిచూసి అలవాటు పడిపోయారు.

'బస్సులో వెళితే బావుండును' అన్న ఆలోచన కూడా అతనికి రాలేదు. అలా బస్సులో వెళ్ళడానికి డబ్బు ఉంటే అతను నిన్నంతా ఏమీతినకుండా ఉండాల్సిన అవసరం కలిగేది కాదు.

నడుస్తూన్నంతసేపు అతని మనస్సులో తను చదివిన జనరల్‌నాలెడ్జి పుస్తకాలు. సబ్జెక్టుకు చెందిన ప్రశ్నలు ఒకటి తరువాత ఒకటిగా తిరిగిపోతున్నాయి. జేబులో ఉన్న ఇంటర్వ్యూ లెటర్‌ను మరో మారు తడిమి చూసుకొన్నాడు.

"రామకృష్ణా మైకా మైనింగ్ లిమిటెడ్"

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మూడు పెద్ద గనుల కంపెనీల్లో అది ఒకటి.

మైనింగ్ ఆఫీస్ చేరుకొనే సరికి అతను పూర్తిగా చెమటతో తడిసిపోయాడు. ఆత్రతగా అక్కడికి చేరుకొన్న అతన్ని ఆ జన సముద్రాన్ని చూడగానే అంతులేని నిరాశ ఆవహించింది. పక్కనే ఉన్న వ్యక్తి నడిగితే చెప్పాడు. ఉన్నవి అరవై పోస్టులట! అభ్యర్థులు ఆరువందల మందిట. నిరాశస్థానాన్ని నిర్లిప్తత ఆవరించుకొంది.

ఎక్కడ చూసినా జనం! వరండాల్లో, చెట్ల నీడల్లో టీ బంకుల్లో...ఎక్కడ చూసినా జనం! జనం!

విశ్వవిద్యాలయాల పుట్టల్లోంచి చీమల్లాగా పుట్టుకొచ్చే నిరుద్యోగులు ఉద్యోగం అన్న పేరు వినగానే ఉలిక్కిపడి పరుగెత్తుకొచ్చే నిర్భాగ్యులు ఎక్కడా నిలబడేందుకు కూడా చోటు లేదు. నెమ్మదిగా నడుచుకొంటూ వెళ్ళి దూరంగా ఉన్న చెట్టు నీడలో నిలబడ్డాడు. చల్లని నీడలోకి రాగానే పోయిన ప్రాణం లేచివచ్చినట్లయింది. మనకబారిన కళ్ళద్దాలను చొక్కా చివరలతో తుడుచుకుని పెట్టుకొన్నాడు.

నలుసుల్లాగా కనిపించే సరికి నిరుద్యోగులపై చెలరేగిపోతున్నాడు సూర్యుడు. దగ్గరలో ఉన్న పెద్ద మైదానం కేసి చూశాడు సుబ్రహ్మణ్యం. ఈ ఇంటర్వ్యూ పుణ్యమా అని అక్కడ ఏడెనిమిది సోడాబండ్లు వెలిశాయి. అక్కడే ఉన్న టీ బంకులు మంచి రష్‌గా ఉన్నాయి.

వాళ్ళను చూస్తుంటే సుబ్రహ్మణ్యానికి అసూయవేసింది.

చదువంటే ఏమో తెలియకపోయినా, హాయిగా తమకాళ్ళమీద తాము నిలబడి కుటుంబాల్ని పోషించుకోగలుగుతున్న ఆ సోడాబండి వాళ్ళను చూస్తున్న కొద్దీ అతని మనసు తన అసహాయతకు భారంతో క్రుంగిపోతోంది.

పోనీ... తనూ వాళ్ళలాగే చేస్తేనో?

చేతుల్లోని ఫైలు వంక ఒకసారి చూసుకొన్నాడు.

ఊహు..! తనవల్లకాదు. తను చదివిన చదువు, తను పెరిగిన పరిస్థితులు, తమ ఇంటి గౌరవ ప్రతిష్ఠలు- ఇవన్నీ తనకు సంకెళ్ళేస్తాయి.

పోనీ అవసరాలను తీర్చలేని వీటిని వదిలేస్తేనో?

తన ఆలోచనలకు తనకే నవ్వొచ్చింది సుబ్రహ్మణ్యానికి. తమ ఇంటి గౌరవ ప్రతిష్ఠలు అనుకోగానే పగలబడి నవ్వాలనిపించింది. ప్రాణం పోయినా సరే గౌరవం కావాలంటూ 'ఫాల్స్ ప్రిస్టేజ్' కోసం ప్రాకులాడే మధ్యతరగతి మనస్తత్వాలు

ఎం.ఎ. పాసయిన మొదట్లో తను ఇంటర్వ్యూకు వెళుతున్నాడంటే ఇంట్లో ఒక పెద్ద పండగలాగుండేది.

నవ్వుతూన్న మొహంతో "క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగి రమ్మంటూ" ఎదురొచ్చే అమ్మ.. "అడిగిన అన్ని ప్రశ్నలకు ధైర్యంగా సమాధానం చెప్పిరా, బస్సులో వెడితే అలిసి పోతావు, ఆటోలో వెళ్ళు" అంటూ చేతిలో పది రూపాయలుంచి ధైర్యం చెప్పే నాన్న.

"విష్యూ బెస్ట్ ఆఫ్ లక్" అంటూ నవ్వుతూ అనే అక్కయ్య. ఆ అనుభూతులన్నీ నెమ్మదిగా కరిగిపోసాగాయి.

నిరుద్యోగ పర్వంలో నాలుగేళ్ళు గడిచేసరికి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.

"ఈ సారన్నా సరిగ్గా చేసి వస్తావా లేక మామూలేనా?" అంటూ గొణుక్కొంటూ డబ్బులిచ్చే నాన్న ఈ మధ్య అడిగినా లేదంటున్నాడు.

'నీమీద ఇంత తగలేశాం! ఆ మాత్రం ఉద్యోగం సంపాదించుకోలేవూ?' అన్నట్లు వ్యంగ్యంగా చూస్తోంది అక్కయ్య.

వీళ్ళందరికీ తెలుసు ఉద్యోగాలు ప్రతిభను బట్టి కాదని

మంత్రుల దగగరనుంచి తెచ్చే రికమండేషన్లకు మోసుకొని వచ్చే డబ్బు కట్టలకు మాత్రమేనని?!

అయినా సుబ్రహ్మణ్యాన్ని చూస్తే వాళ్ళకు అదేరకమైన అసంతృప్తి. తమ దరిద్రానికి కారణం ఇతను అనుకొంటే వాళ్ళకు కొంచెం ఊరట కలిగేది.

కానీ ప్రపంచమంతా మారిపోయినా మారనిది అమ్మ ఒక్కటే

చెరగని చిరునవ్వుతో తరగని ఆత్మవిశ్వాసంతో ఆశీర్వదించి పంపే అమ్మ కోసం ఏదయినా సరే చేసి ఆమెను సుఖపెట్టాలనిపించేది. అందుకే తను చదివిన చదువుకు సరిపడని పని అని మనసులో ఏ మూలో అనిపించినా ఈ అటెండర్ పోస్టుకు అప్లై చేశాడు.

నాన్న రిటైరయిపోయాక పరిస్థితి మరీ దిగజారిపోయింది. పెద్దక్కయ్యకు పెళ్ళి చెయ్యడమూ, చిన్నాడిని చదివించడమూలాంటి వాటిని సమస్యల లిస్టులోంచి తీసేశారు. ఇప్పుడున్న ఒకే ఒక సమస్య...'రే పెలా గడపాలి' అన్న.

ఆలోచనల మాటున మరుగువడి పోయిన ఆకలి నేనున్నానంటూ గుర్తు చేస్తోంది. కడుపులో ఏదో మండుతున్న అగ్నిగోళం ఉన్న భావన. పేగుల్ని తెంచేసేటట్లున్న బాధ! నొప్పి తగ్గేందుకు కడుపును గట్టిగా చేత్తో పట్టుకొన్నాడు. కాస్త తగ్గినట్లనిపించింది.

కానీ ఎంతసేపు? మళ్ళీ మంట ప్రారంభమైంది.

చుట్టూ చూశాడు. కాస్త దూరంలో కొళాయిలో నీళ్ళు వస్తున్నాయి. దగ్గరికెళ్ళి దోసిలి నిండా నీళ్ళు పట్టుకొని త్రాగాడు. ఖాళీ కడుపులోకి నీళ్ళు వెళ్ళే సరికి ఒక్క సారిగా కళ్ళు బైర్లు కమ్మినట్లయింది. అలాగే కింద కూర్చుండి పోయాడు.

ఓపిక తెచ్చుకొని లేచి నిలబడి కడుపు నిండా నీళ్ళు తాగాడు. కడుపులోని బాధ తగ్గింది. కానీ నీరసం ఆవహించుకొంది.

మధ్యాహ్నం రెండు గంటలు కావస్తూంది. ఇంటర్వ్యూకు వచ్చిన వాళ్ళంతా ఎక్కువగా ఇంటర్మీడియట్, డిగ్రీ కేండిడేట్లే. అందుకే తనకు ఉద్యోగం తప్పకుండా వస్తుందని నమ్మకంగా ఉంది సుబ్రహ్మణ్యానికి.

ఇంతలో పాలనురుగులా తెల్లగా మెరిసిపోయే ఫియట్‌కా రొకటి మెత్తగా వచ్చి ఆఫీసుముందు ఆగింది. అంతదాకా అనేక శబ్దాలతో నిండి ఉన్న ఆ ప్రాంతాన్నంతా ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించుకొంది. ఇంటర్వ్యూ ఆఫీసర్లు వచ్చారు అన్నవార్త అక్కడ కార్చిచ్చులా వ్యాపించి పోయింది.

తెరుచుకొన్న కారు తలుపులోంచి కా లొకటి దిగింది. దాని వెనకే దాని తాలూకు ఓ భారీ ఆకారం బట్టతల నిమురుకొంటూ కష్టపడి దిగింది. ఆ వెనకే ఓ రిమ్ లెస్ కళ్ళజోడు మరో ఖద్దరు వంచె నిట్టూరుస్తూ దిగాయి. మొత్తం ముగ్గురు ఇంటర్వ్యూ ఆఫీసర్లు

వాళ్ళు కారు దిగగానే సెక్రటరీ పరిగెత్తుకొంటూ వచ్చి ఇంటర్వ్యూ కెండిడేట్ల లిస్టు అందించాడు. ఆరువందలమంది అని ఫైల్లో చూడగానే వాళ్ళ కనుబొమలు పైకి లేచాయి. తమాషాగా నవ్వుతూన్న వాళ్ళ కళ్ళు అభ్యర్థులకేసి చూశాయి. ముగ్గురూ పగలబడి నవ్వుకొంటూ ఇంటర్వ్యూ



రూమ్‌లోకి వెళ్ళారు. వాళ్ళ వెనకే కూల్‌డ్రింక్స్ కూడా వెళ్ళాయి.

"డామిట్! ఈ ఆరు వందలమందినీ ఇంటర్వ్యూ చేయడం నావల్లకాదు. నాకు పార్టీ మీటింగుంది" అంటూ గాంధీ టోపీని సవరించుకొంది ఖద్దరువంచె. "ఆరు గంటల కళ్ళే ఫ్లైట్‌లో నేను బాంబేకు అర్జెంట్‌గా వెళ్ళాలి. నన్నొదిలేయండి బాబూ".. అంది రిమ్‌లెస్ కళ్ళజోడు.

"అయితే నా కు మాత్రం ఏంపట్టింది?" అంటూ హుంకరించింది బట్టతల.

అయితే ఇప్పు డేం చేద్దామంటావ్...? అనహనంగా అడిగాడు కళ్ళజోడు తన ఇంపోర్టెడ్ వాచ్‌ని చూసుకుంటూ.

"ఐడియా?" అరిచాడు ఖద్దరు వంచె.

మూడురోజుల క్రితం తాను ముఖ్య అతిథిగా వెళ్ళినపుడు జరిగిన పరుగు పందేలు హఠాత్తుగా జ్ఞాపకం వచ్చాయతనికి.

"మనకు కావలసింది అటూ ఇటూ పరిగెత్తి పనిచేయగల అటెండర్లే కదా?"

"ఔను?" మిగతా ఇద్దరూ సందేహాస్పదంగా తలలూపారు.

"వాళ్ళు చదివిన చదువులతో, సంపాదించిన డిగ్రీలతో మనకు పని లేదుగా?"

"ఊ...అయితే?" ఏమిటి నీ ఉద్దేశం అన్నట్లు చూశారిద్దరూ.

"ఆరువందల మందిని బాచిలుగా డివైడ్ చేద్దాం. ప్రతీ బ్యాచికి ఐదు కిలో మీటర్ల పరుగు పందెం పెడదాం. ఒ క్కో బ్యాచ్‌లో మొదటొచ్చిన ముగ్గురికీ మనం ఉద్యోగాలిస్తాం! దట్సాల్!" గర్వంగా చూశాడు ఖద్దరుపంచె.

"ఎవరైనా అబ్జెక్ట్ చేస్తారేమో?" గొణుగుతూన్నట్లడిగాడు బట్టతల.

"వీళ్ళ సంగతి నాకు బాగా తెలుసు ఉద్యోగమిస్తామంటే చాలు ఉరేసుకోడానికి కూడా సిద్ధ పడతారు. డోంట్ బాదర్ అబౌట్ ఇట్. పైగా ఇది మనకు మంచి ఎంజాయ్‌మెంట్ కూడాను. లెట్స్ ఎంజాయ్!" అంటూ కూల్‌డ్రింక్ బాటిల్నెత్తి గటగటా తాగేశాడు.

"త్రీ చీర్స్ టు యువర్ బ్రెయిన్" బాటిల్స్ ఎత్తారు ఇద్దరూ

* * *

కావలసిన ఏర్పాట్లన్నీ వెంటవెంటనే జరిగిపోయాయి. ఐదు కిలోమీటర్లంటే అక్కడున్న గ్రౌండ్‌లో ఐదు రౌండ్లు పరిగెత్తాలి.

అప్పుడే కొంతమంది రన్నింగ్ ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టారు.

అభ్యర్థుల సెలక్షన్ కోసం రన్నింగ్ రేస్ పెడుతున్నారంటే సుబ్రహ్మణ్యం మొదట నమ్మలేదు. "ఎవరో జోక్ చేసి ఉంటారు లెండి?" అన్నాడు నవ్వడానికి ప్రయత్నిస్తూ. కానీ అది నిజమని తెలియగానే మాన్పడిపోయాడు. షాక్‌లోంచి తేరుకోగానే అతనికి చెప్పలేని అసహ్యమేసింది.

పక్కవాడి బలహీనతతో ఆడుకొనే మనిషి శాడిజం మీద ప్రతిభను గుర్తించలేని ప్రభుత్వపు గుడ్డితనం మీద! ఏమీ చేయలేని తన అసమర్థత మీద తనకే అసహ్యమేసింది. సర్టిఫికెట్లు తీసుకొని ఇంటికెళ్ళిపోవడానికి నిశ్చయించుకొని ఒక అడుగు ముందుకేశాడు. కానీ అతని కళ్ళముందు తను ఇంటి కెళ్ళగానే తండ్రి కళ్ళల్లో కదలాడే



అవహేళన అక్క మాటల్లో వినిపించే వ్యంగ్యం ముఖ్యంగా అమ్మ మొహంలో కదిలే ఆశ మెదిలి అతన్ని కట్టిపడేశాయి. మరేం ఆలోచించకుండా తనూ అందరి లాగే ఫైలును చెట్టు కింద పెట్టి గాలికి ఎగిరిపోకుండా బరువుపెట్టి వచ్చి లైనులో నిలబడ్డాడు. అతని నెంబరు మొదటి బ్యాచ్‌లోనే ఉంది.

ఎందుకో తెలియని వేదన అతన్ని నెమ్మదిగా ఆక్రమించుకోసాగింది.

ఎంత ఆపుకున్నా ఆగని దుఃఖం గుండెలోతుల్లోంచి తన్నుకొని వస్తోంది.

పరిసరాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. కళ్ళద్దాలు తీసి ఒకసారి తుడుచుకొని పెట్టుకొన్నాడు.

ఊహు ఇంకా అస్పష్టంగానే ఉంది. మళ్ళీ కళ్ళద్దాలను తుడవబోతుంటే పక్కనున్నతనన్నాడు.

"కళ్ళల్లో నీళ్ళుపెట్టుకొని అద్దాలను తుడిస్తే ఏమొస్తుంది?"అని.

ఆమాత్రం ఓదార్పుకే అతనిలోని వేదన ఒక్కసారిగా బద్దలైంది.

కన్నీళ్ళు కాలువలై చెక్కిలి మీదికి జారి షర్టును తడిపేయసాగాయి. వెక్కిళ్ళు కడుపులోంచి ఒక్కసారిగా బయటపడ్డాయి.

అతని దుఃఖానికి కారణం అతనికే అర్థం కాలేదు. అయినా ఆలోచించే కొద్దీ మరింత ఎక్కువవుతోంది.

ఇన్నేళ్ళు తపస్సులా కష్టపడి చదివిన తన చదువును ఎవ్వరూ గుర్తించలేదన్న బాధ! కడుపునిండా అన్నం పెట్టలేని చదువుకోసం ఇన్నాళ్ళు ఇంతకాలాన్ని వృధా చేసుకొన్నానన్న వేదన ప్రపంచమంతా తనకు ఎదురు తిరిగినట్లు, ప్రజలందరూ నువ్వు మాకు వద్దని తనను పిచ్చికుక్కలా తరిమికొడుతున్నట్లు భావన.

అతను కన్నీళ్ళు తుడుచుకొనేందుకు గానీ, వెక్కిళ్ళను ఆపుకొనేందుకు గానీ ప్రయత్నించ లేదు. 'నన్ను గుర్తించని సమాజాన్ని నేనెందుకు గుర్తించాలి' అన్న ఆలోచన అతని లోని సంస్కారపు మేలిమునుగును చింపేసింది. పక్కకున్న ఇద్దరు ముగ్గురు అతని కేసి ఆశ్చర్యంగానూ, జాలిగానూ చూస్తున్నారు.

సుబ్రహ్మణ్యం ఒకసారి లైను పొడవునా కలియచూశాడు. అందరూ తనకన్నా పొడవుగా బలంగా కనిపిస్తున్నారు. విజిల్ వినిపించగానే దూసుకుపొయ్యేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఒకసారి గట్టిగా ఊపిరి తీసుకున్నాడు.

ఇప్పుడతని కన్నీళ్ళాగిపోయాయి. వెక్కిళ్ళు తగ్గిపోయాయి. గుండెలనిండుగా మొండి ధైర్యం నిండిపోయింది. మనస్సు ఆలోచించడం మానేసి మొద్దుబారిపోయింది. రేపటితో తనకు ప్రభుత్వోద్యోగాలను పొందే అర్హత పోతుంది. తొమ్మిదేళ్ళుగా ప్రయత్నిస్తున్నా రాని ఉద్యోగం 'వయోపరిమితి' మూలంగా శాశ్వతంగా దూరం కాబోతున్నది.

ఈ ఒక్క ఆలోచనే అతని హృదయంలో సుళ్ళు తిరుగుతోంది. అందుకే తను ఈ పరుగుపందెంలో గెలవాలి. ప్రాణాలకు తెగించయినా సరే తను ఇప్పుడు గెలిచి తీరాలి లేకుంటే తను జీవిత పరుగుపందెంలో శాశ్వతంగా వెనక్కు పడిపోతాడు. తనకు తానే ధైర్యం చెప్పుకోసాగాడు సుబ్రహ్మణ్యం.

తమాషాకయినా ఎప్పుడూ ఆటల జోలికి పోకుండా పుస్తకాల పురుగు అని అందరితో అనిపించుకొన్న తను ఈ రోజు జీవితాన్ని పెట్టి పందెంలో పరిగెత్తబోతున్నాడు. విజిల్ మోగేందుకు సిద్ధంగా ఉంది.

తన గుండె చప్పుళ్ళు తనకే వినబడుతున్నాయి. రక్తమంతా మొహంలోకి వచ్చేసినట్లు వెచ్చగా అయిపోయింది. కాళ్ళు, చేతులు సన్నగా వణుకుతున్నాయి. ఇప్పుడు వేసే ప్రతి తప్పుటడుగు తన జీవిత గతినే మార్చివేయగలదని అతనికి అర్థమైపోయింది. కళ్ళైనా ఆర్పకుండా అలాగే ఆ విజిల్ పట్టుకొన్న వ్యక్తి వైపే చూడసాగాడు.

"ఉయ్యి"మంటూ విజిల్ మోగింది.

అందరూ ఒక్కసారిగా ముందుకు దూకారు. వింటినుండి వెలువడిన బాణాల్లా కాదు. బేరల్‌నుంచి దూసుకు వచ్చిన తుపాకి గుళ్ళలా అన్పలు కాదు. రొట్టెముక్క ఆశచూపించినందుకు సర్వశక్తులూ కూడగట్టుకొని పరిగెత్తే ఆకలికొన్న కుక్కల్లాగా

ఇంటర్వ్యూ బోర్డు మెంబర్లు ముగ్గురూ చెట్టునీడలో కూర్చొని కూల్‌డ్రింక్స్ తాగుతున్నారు. మధ్య మధ్యలో సిగరెట్లు తాగుతూ కామెడీ సినిమా చూస్తున్నట్లు వగలబడి నవ్వుకొంటున్నారు.

మూడు వందల మంది ఒక్కసారిగా పరిగెత్తడంతో ఎర్రటి దుమ్ము గాలిలోకి లేచింది. అంతమంది పరిగెత్తడానికి అక్కడ తగినంత స్థలం లేకపోవడంతో అ దో తొక్కినలాటలా తయారైంది.

చెప్పులు తెంచుకొని కొందరు, షర్టులు చించుకొని మరికొందరు క్రిందపడిపోయి ఇంకొందరు కాస్త వెనుకపడిపోయారు.

కింద పడిన ఆ నలుగురైదుగురిమీదా అనేక జతల కాళ్ళు పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాయి. సుబ్రహ్మణ్యం కాస్త పక్కగా ఉండడంతో మొదట వేగంగానే పరిగెత్తగలిగాడు. కానీ అప్పటికే అతనికన్నా ముందు ఓ వందమంది దూసుకుపోతున్నారు.

ఆకలి పోరాటం అప్పుడే ప్రారంభమైంది.

మొదటి రౌండు పూర్తయ్యేసరికి అతను నూటయాభైస్థానానికి దిగజారిపోయాడు. అతని ఓటమి అతనికి స్పష్టంగా తెలిసిపోతోంది. అయినా పట్టువదలకుండా పరిగెడుతూనే ఉన్నాడు.

రెండోరౌండు పూర్తయ్యేసరికి సుబ్రహ్మణ్యం నుదుటిస్వేదం కన్నీటితో కలిసి ఉప్పగా పెదవులకు తగలసాగింది. కాళ్ళల్లో బలం క్రమక్రమంగా తగ్గిపోసాగింది. అప్పటికే అతన్ని

దాటుకొని రెండువందలమందికి పైగా పరిగెడుతున్నారు. తను ఇంకా ఎందుకు పరిగెడుతున్నాడో అర్థం కాకపోయినా పిచ్చి వాడిలా పరిగెడుతూనే ఉన్నాడు.

మూడో రౌండ్ చివరికొచ్చే సరికి పరిస్థితి కాస్త మెరుగయ్యింది. ఆయాసం వల్ల పరిగెత్తలేక చాలామంది ఆగిపోయారు. మరికొంతమంది మెల్లగా పరిగెడుతున్నారు. సుబ్రహ్మణ్యం కన్నాముందు ఇప్పుడు డెబ్బై ఎనభై మంది మాత్రమే ఉన్నారు.

నాలుగో రౌండు ప్రారంభం కాగానే అతనిలోని శక్తి అంతా ఆవిరైపోయినట్లయ్యింది. ఒక్కసారిగా రెండు రోజుల ఆకలి మహోధృతంగా అతన్ని చుట్టుముట్టింది. ఆయాసంతో డొక్కలు ఎగిసిఎగిసి పడసాగాయి. కడుపులో ఆకలి మంటలా మండి శరీరాన్ని నిస్సత్తువగా మార్చి వేస్తోంది. కాళ్ళల్లో పరిగెత్తేందుకు శక్తి అంటూ ఏమీ మిగలలేదు. అతన్ని దాటుకొంటూ ఒక్కొక్కరే ముందు కెళ్ళిపోతున్నారు.

కడుపులో ఒక అగ్ని పర్వతాన్ని గుండెలమీద ఓ మేరు పర్వతాన్ని తలలో తిరిగే నుడిగుండాల్ని మోస్తూ అతను పరిగెడుతున్నాడు.

నాలుగవ రౌండు పూర్తయ్యి చివరి రౌండు పరిగెత్తడం ప్రారంభమైంది. ఎందుకో అతనికి పద్మవ్యూహంలోకి అడుగుబెట్టబోతున్న అభిమన్యుడు గుర్తుకొచ్చి అడుగులు తడబడ్డాయి. పరిగెడుతూనే తల బాగా పైకెత్తి చూశాడు. అప్పుడే ఓ వందమంది దాకా ముందున్నారు. క్షణకాలం నిరాశ నిస్పృహ అతన్ని ఆవరించుకోబోయాయి. ఈ క్షణంలో అవి ఎంత వినాశాన్ని సృష్టిస్తాయో అతనికి తెలుసు. ఒకసారి వాటికి లొంగిపోతే ఇక పోరాటం అంతమయినట్లే. మనస్సును చిక్కబట్టుకొని ముందుకు పరిగెత్తసాగాడు.

ఆకలి అగ్నిగోళమై అతన్ని కాలుస్తోంది.

దప్పిక దావానలమై దహిస్తోంది.

పెదవులేకాదు. గొంతు కూడా పూర్తిగా ఎండిపోయింది. పెదవుల్ని తడిచేసుకొందామంటే నాలుక పిడచకట్టుకుపోయింది. గొంతులో భరించలేని బాధ ప్రారంభమైంది. మింగేందుకు ఎంగిలి కూడా లేదు.

ఇంతలో....

వెనుకనుంచి ముందుకు దూసుకుపోయిన పక్కతని చెయ్యి తగిలి సుబ్రహ్మణ్యం కళ్ళద్దాలు పక్కకు ఎగిరిపోయాయి. మరుక్షణంలో వెనకవచ్చే అతని కాలి కింద పడి 'ఫట్'మంటూ విరిగిపోయిన చప్పుడు సుబ్రహ్మణ్యం చెవులకు లీలగా సోకింది.

అతనిముందు ప్రపంచం స్తంభించింది.

అసలెందుకిలా జరుగుతోంది? లోకమంతా నామీదెందుకు కక్షకట్టింది? విధి నన్నెందుకిలా పరిహసిస్తోంది?

ఆలోచనలతో కొన్ని క్షణాలు అలాగే నిలబడిపోయాడు.

వేదన వెల్లువై ప్రవహిస్తోంది.

కన్నీరు ధారగా కారిపోతోంది.

కాలం మాత్రం మౌనంగా సాగిపోతోంది.

కానీ వెంటనే అతను తేరుకొన్నాడు. గుండె బండగా మారింది. ఆలోచనలు అదృశ్యమయ్యాయి. మళ్ళీ పరుగు ప్రారంభించాడు.

కళ్ళద్దాలు లేకపోవడంతో పరిసరాలన్నీ అస్పష్టంగా కనిపిస్తున్నాయి. దానికి తోడు కళ్ళల్లోని నీళ్ళు మరింత అస్పష్టతకు కారణమయ్యాయి.

ముందు పరిగెడుతున్న మానవాకారాలు, చుట్టూ చేరి కేకలేస్తున్న వెర్రి జనం చెట్టు నీడలో మూడు పైశాచిక రూపాలు అన్నీ అతనికి అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

దూరంగా మోగుతున్న చర్చి గంట 'కమాన్ హరియప్' అంటూ అరుస్తున్న గొంతుకలు- అన్నీ ఎక్కడో వినిపిస్తున్నట్లున్నాయి.

'మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు [?]
పదండి త్రోసుకు [?]
పోదాం, పోదాం పైపైకి [???]'

వెర్రి నవ్వొక్కటి అతన్ని కుదిపివేసింది. పిచ్చివాడిలా అలా నవ్వుకొంటూనే పరిగెడుతున్నాడు.

అతని కళ్ళముందు రన్నింగ్ ట్రాక్ మరేమీ కనిపించడం లేదు. ముందున్న వాళ్ళ గురించి ఇప్పుడతను ఆలోచించడంలేదు.

అసమర్థుడిని కన్నా నన్న అసహ్యంతో మొహం తిప్పుకొనే నాన్న కళ్ళు.. చేతకాని వాడిని చదివించి పొరపాటు చేశారని వ్యంగ్యంగా చూసే అక్క చూపు..! ఎంత కష్టపడ్డా వీడికెందుకు ఉద్యోగమివ్వవని, కళ్ళు చెవులూ నోరూ ఏవీలేని దేవుణ్ణి నిలవేసే అమ్మ మాటలు..!

అన్నీ అతణ్ణి వెంటాడుతున్నాయి...కాదు వేటాడుతున్నాయి.

ఆ మాటల ఈటెలనుంచి, ఆ చూపుల లాకులనుంచి దూరంగా పారిపోయేందుకు అతను పరిగెడుతున్నాడు.

అతనికళ్ళముందు ప్రపంచం పూర్తిగా అదృశ్యమైంది.

ఆకలి అతని ఇంధనమైంది.

ఆలోచన వేగాన్నిచ్చింది.

గెలుపు ధ్యేయమైంది.

మరుక్షణం పరుగు వేగాన్ని పుంజుకొంది.

ఒకరు..ఇద్దరు...పదిమంది..యాభైమంది వరుసగా అతని వెనుక పడి పోతున్నారు. కాళ్ళురెక్కై పరిగెడుతున్నాయి. శక్తి మనసునుంచి నరఫరా అవుతోంది. ఫినిషింగ్ పాయింట్ మరో వందమీటర్ల దూరముంది. అతనికన్నాముందు దాదాపు పదిహేనుమందిదాకా ఉన్నారు.

అనలైన పోరాటం ఆక్షణాన ప్రారంభమైంది.

మనస్సు ముందుకు పరిగెత్తడానికి ప్రయత్నిస్తూంటే శరీరంలోని ప్రతీకణం దానికి ఎదురు తిరగసాగింది.

కాళ్ళు రాళ్ళకు కొట్టుకొని రక్తం కారుతున్నాయి.

అంతదాకా నిలిచిన ఆత్మవిశ్వాసం ఆకలిముందు ఓడిపోతోంది.

కడుపును చేత్తో పట్టుకొని పరిగెత్తసాగాడు. నిస్సత్తువ నిముష నిముషానికి పెరిగిపోతోంది.

కాళ్ళు బండరాళ్ళలా బరువుగా మారిపోయాయి. ఆయాసం మూలంగా ఊపిరి అందడంలేదు. అయినా పరుగు ఆపలేదు.

ఒక్కొక్కరూ అతని వెనకపడిపోతున్నారు.

గమ్యం మరో ముప్పై అడుగుల దూరంలో ఉంది.

అతని కళ్ళముందు..

డిగ్రీ సర్టిఫికెట్లు. గోల్డు మెడలు, ప్రశంసలు, ఇంతకుముందరి ఇంటర్వ్యూలు, తొమ్మిదేళ్ళ నిరుద్యోగం అన్నీ వలయాలుగా తిరుగుతున్నాయి. ఇంట్లోని దారిద్ర్యం, నిరాదరణ, నిస్సహాయత రంగులుగా మారి ఒకదానిలో ఒకటి కలిసిపోతున్నాయి.

శరీరంలోని ఆకలి, నిస్సత్తువ, ఆయాసం, అతన్ని లోబరుచుకొంటున్నాయి. కాళ్ళు తడబడుతున్నాయి. అతని ప్రమేయం లేకుండానే ఆ వేగానికి గాలిలో తేలిపోతున్నాయి.

మరో పది అడుగులేస్తే ఉద్యోగం..! లేకుంటే ఉరిపోసుకోవడం..!! తనలోని సర్వశక్తుల్నీ కాళ్ళలోకి తెచ్చుకొన్నాడు. ఆకలిని, ఆశక్తతను అణిచివేశాడు. ప్రేమగా చూసే అమ్మ కళ్ళను చివరిసారిగా గుర్తుకు తెచ్చుకొన్నాడు. ఊపిరి బిగబట్టి ఉప్పెనలా ముందుకురికాడు.

గుండెల్లో గాలి బయకికొచ్చేందుకు గింగిరాలు తిరుగుతోంది. కళ్ళు వెనక్కి వెళ్ళిపోతున్నాయి. కళ్ళముందు చీకటి తెరలు ఒకటొకటిగా దిగిపోతున్నాయి. అతని చుట్టూ గాఢాంధకారం అలుముకొంది.

ఒక్క ఉదుటున ముందున్న నలుగురినీ దాటుకొని ఫినిషింగ్ లైను మీద కాలుమోపాడు.

అంతదాకా నిలిపి ఉంచిన ఊపిరి, ప్రాణాలతోపాటుగా గాలిలో కలిసిపోయింది. నిర్జీవంగా వాలిపోతున్న అతని పెదవులపై 'ఎందుకో' ఒక నవ్వు నిలిచిపోయింది. ✱